# అరాచకమా వర్ధిల్లు!

వి. మోహనకుమార




దిల్‌సుక్ నగర్ విశాలమైన తారురోడ్డు మీద శరవేగంతో పోతోంది ఆటో. దాంట్లో కూర్చున్న శంభు ఆలోచనలు అంతకన్నా వేగంగా పరుగెడుతున్నాయి.

ఇంటర్వ్యూ అయి సంతృప్తితో బయటకి వచ్చినట్టు ... ఎప్పాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చినట్టు ... అందరూ తనని అభినందిస్తూంటే విజయగర్వంతో ఛాతీ విరుచుకుని అందరి దెస చూస్తున్నట్టు ఊహించుకుని కలలు కంటున్నాడు.

మలక్‌పేట రైల్వే బ్రిడ్జి దాపుల్లోకి వచ్చిన ఆటో ఒక్కసారిగా కీచుమని కుదుపుతో ఆగింది.

“రషీద్ భాయీ! ఆటో ముందుకి తీసుకు పోవద్దు. పెద్ద గొడవవుతోంది” అన్నాడు, ఆటోని ఆపమని సైగచేసి ఆపించిన మరో ఆటో డ్రైవర్.

“ఏమైంది” అడిగాడు రషీద్.

“బస్‌కి ఆటోకి గొడవయింది. ఇసామియా బజార్, చాదర్‌ఘాట్ ఏరియా గొడవగా ఉంది. ఆటో బంద్. అంతకుమించి తెలియదు” అన్నాడతను.

అలా అని ముందుకు దూసుకుపోయాడు.

శంభు ఈ లోకంలోకి వచ్చాడు.

“ఏమైంది?”

“తెలియద్ సాబ్! ఆటో ముందుకిపోదు.”

శంభుకి గుండె ఆగిపోయినట్టయింది. “దయ చేసి సాధ్యమైనంత దూరం తీసుకెళ్ళు. ఆలస్యం అయితే బస్సు వెళ్ళిపోతుంది. నేను ఇంటర్వ్యూకి వెళ్ళాలి” శంభు ఆటో డ్రైవర్ని బ్రతిమాలాడు దీనంగా.

“అది సరే సాబ్! మీ ఇంటర్వ్యూకని ఇరవై వేల ఆటో పాడుచేసుకోమంటరా? దిగండి”